మెరుగైన వైద్య సేవలందించాలి

సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

కొల్చారం, నవంబర్ 18: దవాఖానలో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ ఆదేశించారు. సోమవారం కొల్చారం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దవాఖానలోని ప్రతి గదిని తిరిగి చూసి పరిశుభ్రతను పరిశీలించారు. రోగులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దవాఖానలోని మందుల స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై వారికి సలహాలు, సూచనలు ఇచ్చారు. సమావేశంలో మండల వైద్యాధికారి రమేశ్, ఆయుష్ మెడికల్ అధికారి హర్ష, ఎంపీహెచ్‌ఈవో మదన్‌మోహన్, యేసుమని, సరిత పాల్గొన్నారు.

పంట అవశేషాలను కాల్చొద్దు

అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి ఏడీఏ

రామాయంపేట, నవంబర్ 18: పంట అవశేషాలు కాల్చితే భూమిలో భూసారం తగ్గి పంట దిగుబడి రాదని వ్యవసాయ శాఖ డివిజన్ ఇన్‌చార్జి ఏడీఏ రాజ్‌నారాయణ అన్నారు. సోమవారం రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామంలో రైతులతో ముచ్చటించారు. కాల్చివేతలతో భూసారం తగ్గి పంట రాదన్నారు.

కార్మికులను దోచుకుంటున్న దేశాయి బీడీ కంపెనీ

బస్సులో పనికి వెళ్తున్న బీడీ కార్మికులు

రామయాంపేట, నవంబర్ 18: దేశాయి బీడీ కంపెనీ ఏజంట్లు సరైన ధర ఇవ్వకుండా నిలువు దోపిడీ చేస్తున్నారని బీడీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రామాయంపేటకు చెందిన 20 మంది బీడీ కార్మికులు పత్తులు ఏరేందుకు గజ్వేల్‌కు ఆర్టీసీ బస్సులో వెళ్లారు. బీడీల ఏజంట్లు తమ వద్ద నుంచి 700 బీడీలు కట్ చేసుకుంటున్నారని, వారం బీడీల మీద ఒక కట్ట పెట్టాలని, లేకుంటే ఫారంలో రాయరని తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి ఒకరు మృతి

పాపన్నపేట, నవంబర్ 18: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడి ఒకరు మృతి చెందిన ఘటన పాపన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్సై సంగన్న తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన బైండ్ల జశ్వంత్ (19) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన స్నేహితుడు ఉమా మహేశ్వర్‌తో కలిసి బైకుపై ఆదివారం రాత్రి పాపన్నపేటకు వెళ్లి, తిరిగి వస్తున్నాడు. యూసూఫ్‌పేట గ్రామ శివారులో వాహనం అదుపు తప్పి కిందపడ్డారు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి 108లో చికిత్స నిమిత్త దవాఖానకు తరిలించారు. జశ్వంత్ మార్గమధ్యలో మృతి చెందాడు. ఉమామహేశ్వర్‌ను మెరుగైన వైద్యం కోసం నగరంలోని గాంధీ దవాఖానకు తరిలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

తెలంగాణ కల్చర్ సొసైటీ సింగపూర్ ఉపాధ్యక్షుడిగా బసిక ప్రశాంత్‌రెడ్డి

చేగుంట, నవంబర్ 18: తెలంగాణ కల్చర్ సొసైటీ సింగపూర్ 11వ ఉపాధ్యక్షుడిగా రుక్మాపూర్ గ్రామానికి చెందిన బసిక ప్రశాంత్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సొసైటీ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని సింగపూర్‌లోని ఆర్యసమాజ్‌లో నిర్వహించారు.

చేగుంటలో లోకమంతన్ పోస్టర్ ఆవిష్కరణ

చేగుంట, నవంబర్ 18: చేగుంటలో లోకమంతన్ పోస్టర్‌ను తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు చేగుంటలోని ఆదర్శ పాఠశాల ఆవరణలో సోమవారం ఆవిష్కరించారు. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటుందన్నారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

చిలిపిచెడ్, నవంబర్ 18: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో విఠల్ సూచించారు. సోమవారం చిట్కుల్ జడ్పీహెచ్‌ఎస్, కేజీవీబీని సందర్శించారు.

చేప పిల్లల పంపిణీ

చిలిపిచెడ్, నవంబర్ 18: ఫైజాబాద్ గ్రామంలోని పెద్ద చెరువులో మత్స్య సంఘం సభ్యులు సోమవారం 76,500 చేపపిల్లలను వదిలారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు జనార్దన్, కిష్టయ్య, లక్ష్మణ్, విఠల్ పాల్గొన్నారు.

ప్రారంభం సరే.. కొనేదెప్పుడు?

సీతానగర్ కొనుగోలు కేంద్రం వద్ద పేరుకుపోయిన ధాన్యం కుప్పలు

ధాన్యం తూకం వేయకపోవడంతో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

- కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి 26 రోజులు గడుస్తున్నా.. కొనుగోళ్లు సున్నా..
- వెంటనే ధాన్యం కొనాలని రైతుల డిమాండ్

అల్లాదుర్గం, నవంబర్ 18: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించడానికి నానా కష్టాలు పడాల్సి వస్తున్నది. ధాన్యాన్ని చివరి గింజ వరకు కొంటామని ప్రభుత్వం చెబుతున్న మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. ధాన్యాన్ని కొనేందుకు ప్రభుత్వం ఐకేపీ, పీఏసీఎస్‌ల ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఇంతవరకు బాగానే ఉంది కానీ, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని మాత్రం ఇప్పటి వరకు కొనడం లేదు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అల్లాదుర్గం మండటంలోని సీతానగర్‌లో అక్టోబర్ 23న ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్రాన్ని ఏర్పాటు చేసి 26 రోజులు గడుస్తున్నా ధాన్యం మాత్రం కొనుగోలు చేయడంలేదు. ఈ కేంద్రం వద్ద రైతులు ధాన్యం తీసుకొచ్చి 20 రోజుల నుంచి కాపలాకాస్తున్నారు. సోమవారం పలువురు రైతులు తమ ధాన్యాన్ని కొనాలని ధాన్యం కుప్పల వద్ద నిరసన చేశారు. రాత్రి, పగలు ధాన్యం కుప్పల వద్ద కాపలా కాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు. రెండు రోజుల్లో ధాన్యాన్ని కొనకపోతే తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తేమని హెచ్చరించారు. ఈ విషయంలో ఏపీఎం నాగరాజు వివరణ కోరగా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినా, హమాలీలు దొరకకపోవడంతో ధాన్యాన్ని కొనుగోలు చేయలేదన్నారు. హమాలీలు రాగానే కొనుగోలు చేపడతామని తెలిపారు.

సమగ్ర సర్వేలో అవకతవకలకు తావులేదు

- సర్వే పత్రాలను భద్రపరుస్తాం
- కలెక్టర్ రాహుల్‌రాజ్

కౌడిపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ మున్సిపాలిటీ: వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

కౌడిపల్లి, నవంబర్ 18: సమగ్ర సర్వేలో ఎలాంటి అవకతవకలకు తావులేదని, పకడ్బందీగా పత్రాలను భద్రపరుస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం కౌడిపల్లిలో ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేతో అందుతున్న సంక్షేమ పథకాలను ఎవరూ తీసివేయరని, ప్రజలు ధైర్యంగా తమ సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు. వివరాల సేకరణలో కాస్త ఆలస్యమైనా సరే కానీ తప్పిదాలకు తావు లేకుండా ఎన్యూమరేటర్లు పకడ్బందీగా సర్వే నిర్వహించాలన్నారు. జిల్లాలో 2.20లక్షల కుటుంబాలు ఉన్నాయని, నేటితో 70 శాతం 1.50లక్షల కుటుంబాల సర్వే పూర్తయ్యిందని, మూడు నాలుగు రోజుల్లో కంప్లీట్ అవుతుందని ఆయన తెలిపారు. సేకరించిన డాటాను వారం తర్వాత డేటా ఎంట్రీ ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ ఆంజనేయులు, ఏపీవో పుణ్యదాస్, ఆర్ఐ శ్రీహరి, ఎంపీవో కరీముల్లా, సెక్రటరీ వెంకటేశం పాల్గొన్నారు.

ప్రతి కుటుంబ సమాచారం సేకరించాలి

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 18: జిల్లాలోని ప్రతి కుటుంబానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం 1వ వార్డులోని కలెక్టర్ నివాస గృహంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి వివరాలు నమోదుచేశారు. జిల్లాలో ప్రజల సహకారంతో సమగ్ర కుటుంబ సర్వే ప్రశాంతంగా కొనసాగుతున్నదని కలెక్టర్ తెలిపారు. ఈనెల 17వ తేదీ వరకు జిల్లాలో 1,37,673 కుటుంబాలకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని సేకరించామని, 62.93 శాతం సర్వే నమోదైందన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

చేగుంటలో రాష్ట్రస్థాయి వాలీబాల్‌లో రెండో స్థానంలో మెదక్ జిల్లా బాలికల జట్టుకు బహుమతి అందజేస్తున్న తూప్రాన్ ఆర్డీవో జయచంద్రరెడ్డి

చేగుంట, నవంబర్ 18: క్రీడల్లో గెలుపోటములు సహజమని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రరెడ్డి అన్నారు. చేగుంటలోని ఆదర్శ పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఎస్‌జీఎఫ్ బాల బాలికల రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 68 క్రీడలు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పరంజ్యోతి ఆధ్వర్యంలో సోమవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు, మొమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి, జాతీయస్థాయికి వెళ్లడం అభినందనీయమన్నారు. చేగుంటలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడల్లో మెదక్ జిల్లా బాలికల జట్టు రెండో స్థానం కైవసం చేసుకున్నట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అయిత పరంజ్యోతి తెలిపారు. క్రీడాకారులను ఆయన అభినందించారు. కార్యక్రమంతో తహసీల్దార్ నారాయణ, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్, ఎంఈవో నీరజ, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ, రాష్ట్ర యోగా కోచ్ కరణం గణేశ్‌కుమార్, పీఈటీల జిల్లా సంఘం అధ్యక్షుడు నాగరాజు, పీఈటీలు అల్లి నరేశ్, ఏ.శంకర్, విష్ణు, శంకర్, శ్రీనివాస్, శారద పాల్గొన్నారు.

ప్యాడీ ప్లాంటర్‌తో వరి నాట్లు

పొలంలో నాటు వేస్తున్న వరినాటు యంత్రం

- యంత్రంతో గంటలో ఎకరం నాటువేస్తున్న రైతులు
- ఆదర్శంగా నిలుస్తున్న కోనాపూర్ రైతులు

రామాయంపేట, నవంబర్ 18: కూలీల కొరత ఏర్పడడంతో రైతులు తమ వ్యవసాయ పొలంలో వరినాటు యంత్రం ప్యాడీ ప్లాంటర్‌తో నాటువేస్తున్నారు. పొలాన్ని ట్రాక్టర్‌తో దున్ని నాటు వేసేందుకు వారం రోజులుగా కూలీల కోసం ఎదిరి చూసినా ఫలితం లేకుండా పోయింది. కూలిల కొరతతో హైదరాబాద్ శివారులోని ఓ రైతు వరి యంత్రంతో నాటు వేస్తున్న విషయం తెలుసుకుని ఆ యంత్రాన్ని కోనాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు దీపక్‌రెడ్డి, అశోక్‌రెడ్డి తీసుకొచ్చారు. సోమవారం వారికున్న పొలంలో యంత్రంతో నాట్లు వేయిస్తున్నా రు. ఈ యంత్రం గంటలో ఒక ఎకరం నాటేస్తుంది. యంత్రాన్ని డ్రైవర్ నడిపిస్తే చాలు దానంతట అదే నాటేస్తుంది. దీంతో ఎకరాకు రూ.4వేల ఖర్చవుతుంది. కూలీల కొరతతో రైతులు ఎక్కువ శాతం ఈ యంత్రంవైపే మొగ్గు చూపుతున్నారు.

కూలీలు దొరకక ఇబ్బందులు పడ్డాం

నాటు వేద్దామంటే కూలీల కొరత. దీంతో ఇబ్బందులు పడ్డాం. ఎలాగైనా యంత్రంతో నాటేయాలని హైదరాబాద్ శివారులో నడుస్తున్న యంత్రాన్ని ఎకరాకు రూ.4 వేల ధర మాట్లాడుకుని తీసుకొచ్చాం. మాకున్న పది ఎకరాల్లో యంత్రంతోనే నాటేశాం. ఒక్కరోజులోనే పదెకరాల్లో నాటేశాం.

- దీపక్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రైతులు, కోనాపూర్

యంత్రంపై వరినారు పెట్టిన రైతులు

ధాన్యం త్వరగా అన్‌లోడ్ చేయాలి

శివ్వంపేటలో రైస్‌మిల్లును సందర్శించిన ఆర్డీవో మహిపాల్‌రెడ్డి

శివ్వంపేట, నవంబర్ 18: మండలంలోని రైస్‌మిల్లుల వద్ద ధాన్యాన్ని త్వరగా అన్‌లోడ్ చేయాలని రైస్‌మిల్లుల నిర్వాహకులను నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం మండలంలోని గూడురు, చెన్నాపూర్ గ్రామాల రైస్‌మిల్లులను ఆర్డీవో సందర్శించారు. రోజువారీగా వస్తున్న ధాన్యాన్ని అదనంగా హమాలీలను పెట్టుకుని లారీల నుంచి అన్‌లోడ్ చేసేలా చూడాలన్నారు. ప్రధాన రహదారిపై రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి, రోడ్డు ప్రమాదాల గురించి వివరించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ షఫియొద్దీన్, ఆర్ఐ కిషన్ ఉన్నారు.

రసీదు తీసుకోవాలి: డీఎస్పీ

నర్సాపూర్, నవంబర్ 18: ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిల నుంచి రైతులు రసీదులు తీసుకోవాలని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి సూచించారు. సోమవారం సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై లింగంతో కలిసి మండలంలోని తుల్జారాంపేట్ కొనుగోలు కేంద్రాన్ని, శివ సాయి బాయిల్డ్ రైస్‌మిల్‌లో తనిఖీ చేశారు. వీరితో పాటు డీటీ ప్రణీత, రైస్‌మిల్ ఇన్‌చార్జి రామరాజు, తదితరులు ఉన్నారు.

నర్సాపూర్: రైస్‌మిల్ వద్ద ధాన్యాన్ని పరిశీలిస్తున్న తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి

ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

నర్సాపూర్ బీవీఆర్ఐటీ పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థి హాల్ టికెట్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ మహేందర్

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 18: రెండు రోజులుగా కొనసాగిన గ్రూప్-3 పరీక్షలు సోమవారం ముగిశాయి. జిల్లాలోని 19 పరీక్షా కేంద్రాల్లో 5,867 మంది అభ్యర్థులకు 3,166 మంది హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 53.96 శాతం హాజరు నమోదైంది.

పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన అడిషనల్ ఎస్పీ

నర్సాపూర్, నవంబర్18: నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో నిర్వహించిన గ్రూప్-3 పరీక్షా కేంద్రాన్ని అడిషనల్ ఎస్పీ మహేందర్ సందర్శించారు. ఎలాంటి అవాంఛనీయమైన ఘటనలు జరగకుండా చర్య లు తీసుకున్నామన్నారు. ఆయనతో సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై లింగం, సిబ్బంది ఉన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట, నవంబర్ 18: పట్టణంలోని రెండు పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. పరీక్షలకు అభ్యర్థులు అంతంత మాత్రమే హాజరయ్యారు. కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమల్లో ఉంచారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రంలోనికి అనుమతిచ్చారు. పరీక్షా కేంద్రాలను సీఐ వెంకటరాజాగౌడ్, తహసీల్దార్ రజనీకుమారి సందర్శించారు.

మెదక్‌లోని పరీక్షా కేంద్రాల వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

గుండెపోటుతో బీఆర్ఎస్ కార్యకర్త మృతి

శంకరయ్య మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి నివాళి



శంకరయ్య మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబీకులను ఓదార్చుతున్న పద్మారెడ్డి

నిజాంపేట, నవంబర్ 18: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మనుబోతు శంకరయ్య(53) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సోమవారం రాంపూర్ గ్రామానికి చేరుకుని శంకరయ్య మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రటిష్టతకు కృషి చేసిన కార్యకర్త శంకరయ్య, ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. బాధిత కుటుంబీకులకు అండగా ఉంటామన్నారు. నస్కల్‌లో వారం రోజుల క్రితం మృతి చెందిన కిష్టారెడ్డి కుటుంబీకులను పరామర్శించారు. ఆమె వెంటా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు గౌస్, నస్కల్, రాంపూర్ గ్రామాల అధ్యక్షులు దుర్గయ్య, యాదగిరి, మాజీ ఎంపీపీ సంపత్, మాజీ సర్పంచ్ విజయ్, నాయకులు దుబ్బ రాజగౌడ్, నగేశ్, పర్శాగౌడ్, మోహన్‌రెడ్డి, అంజాగౌడ్, ఎల్లం, చిన్న అంజాగౌడ్ ఉన్నారు.

కాంగ్రెస్ హామీలు నెరవేర్చాలని వినతి

నర్సాపూర్, నవంబర్ 18: కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ నర్సాపూర్ నియోజకవర్గ ఆశ వర్కర్ల సంఘం సభ్యులు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి సోమవారం క్యాంప్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు బాసంపల్లి లత, సంధ్యారాణి, కోశాధికారులు ఫర్జానా బేగం, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

నిజాంపేట, నవంబర్ 18: మండలంలోని చల్మెడ గ్రామానికి చెందిన కడబోయిన శ్యామవ్వకు రూ.60 వేలు, రాగుల పరశురాములుకు రూ.40 వేలు, రాగుల బాబయ్యకు రూ.6 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్ నర్సింహారెడ్డి, రమేశ్ అందజేశారు. కార్యక్రమంలో రాములు, శ్రీను, రమేశ్, రాజయ్య, మల్లేశం, తిరుమలయ్య, కొమురయ్య, రామస్వామి తదితరులు ఉన్నారు.

గైర్హాజరయ్యే విద్యార్థుల ఇంటికి ఎంఈవో

బడికిరాని విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో బుచ్యానాయక్

శివ్వంపేట, నవంబర్ 18 : చిన్నగొట్టిముక్ల జడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు పలువురు తరుచూ బడికి డుమ్మా కొడుతున్నారు. దీంతో సోమవారం స్వయంగా ఎంఈవో బుచ్యానాయక్ విద్యార్థుల ఇంటికి వెళ్లారు. పాఠశాల పరిధిలోని ఎస్సీ కాలనీ, కొత్త కాలనీ, దేవమ్మగూడెంతండా, టిక్యాతండాలకు వెళ్లి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. డుమ్మాలు కొడితే చదువుకు ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి హెచ్‌ఎం ఇందుమతి, సీఆర్‌పీ దాసు ఉన్నారు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

తూప్రాన్, నవంబర్ 18: రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శివానందం హెచ్చరించారు. వరి కోత మిషన్ బ్లేడ్‌ను వెనకాల ట్రాలీకి తగిలించుకోకుండా, ఇంజిన్‌కు ఫిట్ చేసి తరలిస్తున్న హార్వెస్టర్‌ను పట్టుకుని మోటార్ వెహికల్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. హార్వెస్టర్ నడిపేవాళ్లు బ్లేడ్‌ను ఇంజిన్ ముందు భాగానికి వేసుకుని ప్రమాదకరంగా, నిర్లక్ష్యంగా ప్రయాణిస్తున్నారన్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు.

ఘనంగా కార్తిక మాసోత్సవాలు

గంగాజలాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

శివునికి 108 కలశాలతో జలాభిషేకం

కౌడిపల్లి, నవంబర్ 18: కార్తిక సోమవారం సందర్భంగా బతుకమ్మ తండాలోని ఆదిలక్ష్మి ఆశ్రమంలో గల శివలింగానికి 108 కళాశాలతో జలాభిషేకం చేశారు. అభయ రామాలయం అర్చకుడు ఫణీంద్ర శర్మ 108 కళాశాలకు మహా సంకల్ప కలశారాధన, గంగా హారతి, ప్రత్యేక పూజలు చేసి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, రమాదేవి దంపతులు, శివభక్తులు పాల్గొన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట, నవంబర్ 18: రామాయంపేటలోని భక్త మార్కండేయ ఆలయంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు మద్దెల రమేశ్, మాధవి దంపతులు, పూజారి రాజయ్య ఆధ్వర్యంలో అభిషేకాలు చేశారు.

గిరిజనులకు అండగా చలో లగచర్ల

మాట్లాడుతున్న నెహ్రూనాయక్

రేగోడ్, నవంబర్ 18: గిరిజనులకు అండగా చలో లగచర్ల అని అందోల్ తాలుక గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు నెహ్రూ నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం రేగోడ్ గాంధీ చౌక్ వద్ద నినాదాలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. వికారాబాద్ జిల్లా లగచర్లలో జరిగిన గొడవలో రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని, ఆయా తండావాసులు రోటిబండ, పులిచర్ల, గడ్డమీది, ఈదులకుంట, మైసమ్మ తండా బాధిత మహిళలు, రైతులకు అండగా వారిని పరామర్శించేందుకు ఈ నెల 20న వెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఆయనతో నాయకులు సురేశ్‌నాయక్, శివరాం నాయక్, విగ్నేశ్ నాయక్, పూల్ సింగ్ నాయక్, చిన్న తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం

దగ్ధమైన గుడిసె వద్ద బాధితులు

వెల్దుర్తి, నవంబర్ 18: చర్లపల్లి పంచాయతీలోని గిరిజన తండాకు చెందిన కెతావత్ గోపాల్ పూరిగుడిసె విద్యుదాఘాతంతో దగ్ధమైంది. సోమవారం ఉదయం ఒక్కసారిగా విద్యుత్ వైర్ల నుంచి మంటలు చెలరేగి గుడిసెకు అంటుకున్నాయి. దీంతో గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఘటనలో రూ. 20 వేల నగదు, బట్టలు, వంటసామగ్రి, నిత్యావసర సరుకులు, సేవాలాల్ మహరాజ్ ఆలయానికి సంబంధించిన రూ.30 వేల సామగ్రి కాలిపోయింది.